# ఈనాడు
## నాగర్‌కర్నూల్



# కొండారెడ్డిపల్లికి కొత్త శోభ


ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

**వంగూరు, కల్వకుర్తి, న్యూస్‌టుడే :** ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి దసరా పండగ రోజు రావటం కొత్త శోభ సంతరించుకుంది. శనివారం మధ్యాహ్నం ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకున్నారు. గజమాలలతో గ్రామస్థులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. వాహనంలో రోడ్డు వెంట పూలవర్షం కురిపిస్తూ కోలాటాలు, బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా గ్రామస్థులు, బంధువులను మర్చిపోకుండా పేరుపేరునా పలుకరించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సీఎం పంచెకట్టుతో సాయంత్రం 6.30 గంటలకు ఇంట్లో నుంచి బయలుదేరి ఆయనే నిర్మించిన కోటమైసమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొండారెడ్డిపల్లికి ముఖ్యమంత్రి వస్తున్నారని గ్రామానికి చెందిన ఆడబిడ్డలు, అల్లుళ్లు, బంధువులు రాకతో ఊరంతా జనసందోహంతో కళకళలాడింది. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు. అనంతరం గ్రామ యువకులతో స్వీయచిత్రాలు దిగారు.

### ఆరు గంటలపాటు సీఎం పర్యటన

ఆరుగంటల పాటు కొండారెడ్డిపల్లిలో ఉండి బంధువులు, గ్రామస్థులు, అభిమానులకు సమయమిచ్చారు. రాత్రి 8.15 గంటలకు ప్రత్యేక వాహనాల్లో కొడంగల్‌కు వెళ్లారు.

**రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు..:** గ్రామానికి చెందిన వ్యక్తి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కొండారెడ్డిపల్లికి నాలుగు వరుసల రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయటం, నిత్యం జిల్లా అధికారులు గ్రామానికి వస్తుండటంతో ప్రజల్లో ఆనందాలు వెల్లివిరిసింది. రూ. 50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామ రూపురేఖలు మారిపోయాయి. అనేక వసతులు సమకూరాయని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.


జమ్మి పూజకు గ్రామస్థులతో తరలివెళ్తున్న రేవంత్‌రెడ్డి, పక్కన మల్లు రవి, డా.వంశీకృష్ణ

### అప్పన్న కొండకు
# బంగారన్నద్దిన భానుడు



**తిమ్మాజిపేట, న్యూస్‌టుడే :** దసరా రోజున ఆనందం, సరదా నింపాలనుకున్నాడేమో కాని భానుడు కొండకు బంగారన్నద్ది కనువిందు చేశాడు. సాయంత్రం సమయంలో తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లి సమీప అప్పాద్రి లక్ష్మీనరసింహస్వామి కొండపై మాత్రమే ఎండ పరచుకొని తళుక్కున మెరిసింది. కొండచుట్టూరా పచ్చటి పంటపొలాలుండగా కొండప్రాంతం మాత్రం ఎండతో కనువిందుచేసింది. గుర్తించిన చుట్టుపక్కల గ్రామాల వారు చరవాణుల్లో బంధించారు. - న్యూస్‌టుడే, తిమ్మాజిపేట

# ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

## గద్వాల జిల్లాలో నిబంధనలు హుష్ అభ్యంతరం వచ్చినా లెక్కజే

ఈనాడు, మహబూబ్‌నగర్

మహారాష్ట్రలోని అక్కల్‌కోట నుంచి చెన్నై వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు జోగులాంబ గద్వాల జిల్లాలో 77.5 కిలోమీటర్ల మేరకు సాగుతున్నాయి. ఈ పనుల కోసం కేంద్రం రూ.1,568 కోట్లు కేటాయించింది. పనుల్లో భాగంగా మొరం మట్టిని వాడాలి. ప్రస్తుతం వడ్డేపల్లి మండలంలో పనులు కొనసాగుతున్నాయి. జూలకల్ ప్రాంతంలో కొన్ని ఎకరాల్లోని వ్యవసాయ భూములను మొరం మట్టి పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఇందులో భాగంగా కొందరికి ఎకరాకు రూ. లక్షల్లో ముట్టజెప్పారు. ఈ గ్రామంలోనే ఉన్న ఓ గుట్టను చెరపట్టారు. ఆర్డీఎస్ కాలువ వెంట ఉన్న పలు భూములను జేసీబీ, పొక్లెయిన్లు, టిప్పర్లు పెట్టి 10 అడుగులకుపైగా గుంతలు తీస్తున్నారు. ఇటీవల పడిన వర్షాలతో ఈ ప్రాంతాల్లో కొత్త చెరువులు పుట్టుకొచ్చాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెరువనుకున్నారా? అయితే భ్రమ పడినట్లే. అచ్చం చెరువును తలపిస్తున్న ఈ ప్రాంతం ఏడాది క్రితం వరకు సాగు భూమి. కొన్ని ఎకరాల్లో ఉన్న ఈ భూమి చెరువుగా ఎలా మారిందని అనుకుంటున్నారా. మొరం మట్టి తవ్వడంతో ఈ పరిస్థితి నెలకొంది. వడ్డేపల్లి మండలం జూలకల్‌లోని ఆర్డీఎస్ కాలువకు సమీపంలోని భూములను ఈ ప్రాంతంలో చేపడుతున్న భారత్‌మాల రహదారి కోసం తవ్వారు. ఇక్కడ పట్టా, సీలింగ్ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతో ఎకరాలు ఎకరాలు చెరువులను తలిపిస్తున్నాయి. సుమారు 10 అడుగుల లోతు వరకు భూమిని తవ్వి మొరం తరలించారు.

- వడ్డేపల్లి గట్టు మాయమవుతోంది. ఇక్కడ మాధవస్వామి ఆలయం ఉంది. ఇక్కడి నుంచి కొన్ని లక్షల టన్నుల్లో మొరం మట్టిని తరలించారు. ఇక్కడి గుట్టను ఇష్టారాజ్యంగా తవ్వడంపై



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వడ్డేపల్లి గట్టు. దీనిపై మాధవ స్వామి ఆలయం కూడా ఉంది. ఒక్కప్పుడు 25 ఎకరాలకుపైగా ఈ గుట్ట విస్తరించి ఉండేది. జాతీయ రహదారి కోసమని అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వారు. ప్రస్తుతం 25 ఎకరాల గుట్ట పూర్తిగా మాయమయ్యే పరిస్థితి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరపడంతో జిల్లాలోనే ఎంతో గుర్తింపు ఉన్న ఈ గుట్ట ప్రస్తుతం మాయమయ్యే పరిస్థితి వచ్చింది.

యడం లేదు. బుడమర్సు, తనగలలోని గుట్టలను కూడా యథేచ్ఛగా తవ్వుతున్నారు. ఈ రెండు గ్రామాల్లోని ప్రధాన గుట్టలను ఖాళీ చేస్తున్నారు.

**కిమ్మనని యంత్రాంగం :** నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నా నాయకులు, అధికార యంత్రాంగం నోరెత్తడం లేదు. నియోజకవర్గంలో కీలకంగా ఉన్న కొందరు వ్యక్తులకు చేయితడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జరిమానాలు విధించామని భూగర్భ గనులశాఖ అధికారులు పైకి చెబుతున్నా అవన్నీ ప్రకటనలకు, కాగితాలకే పరిమితం. సాధారణంగా టన్ను మొరం మట్టికి రూ. 35, రాళ్లకు రూ. 80 వరకు సినరేజీ ఛార్జీలు చెల్లించాలి. గతంలో గట్టు, కేటీదొడ్డి మండలాల్లో తవ్వకాలు జరిగినప్పుడు విమర్శలు హోరెత్తడంతో సుమారు రూ. 56కోట్ల వరకు జరిమానాలు విధించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీనిపై జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీనారాయణను 'ఈనాడు' సంప్రదించగా క్షేత్రస్థాయికి అధికారులను పంపించి విచారణ చేయిస్తామని తెలిపారు.



## నింగీనేలను.. ఏకం చేసిన మేఘం!

తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లి సమీప వెంకటాద్రి జలాశయం వద్ద మేఘాలు నేలపైకొచ్చినట్టుగా ఆవిష్కృతమైంది. ఆకాశమంతా మేఘావృతమవడం, అవన్నీ నేలపైకి వచ్చినట్టుగా కన్పించడంతో అటుగా వెళ్తున్నవారు ఫొటోలు దిగుతూ సంబరపడ్డారు. నీలిమేఘాలు నేలపై వాలినట్టుగా కన్పించిన దృశ్యాన్ని న్యూస్‌టుడే క్లిక్‌మనిపించింది.
- న్యూస్‌టుడే, తిమ్మాజిపేట

# కేఎల్ఐ డి-82 కాల్వకు గండి


కాల్వకు గండిపడి వరి చేనులోకి వృథాగా పోతున్న నీరు


గండిని పూడ్చుతున్న పొక్లెయిన్

**చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే :** చారకొండ మండలం జూపల్లి గ్రామ సమీపంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డి-82 ప్రధాన కాల్వకు శుక్రవారం రాత్రి గండిపడింది. ఇటీవల కేఎల్ఐ ద్వారా సాగునీటిని దిగువకు విడుదల చేయడంతో కాల్వ నిండుగా పారింది. డి-82 ప్రధాన కాల్వ 15కిలో మీటరు వద్ద గండి పడటంతో కాల్వలోని నీరంతా సమీప చింతచెరువు, తూము చెరువు, కుమ్మరికుంటలు నిండి అలుగు పారుతున్నాయి. కాల్వను అనుసరించి సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. కడారి పెద్దయ్య, వెంకయట్య, లింగయ్య, ఆలువేలు, జంగమ్మ, లక్ష్మమ్మ, లక్ష్మీదేవి, ఎల్లయ్య, శ్రీను, లక్ష్మయ్యకు చెందిన 20 ఎకరాల పొలాలు ఇసుకమేటలతో నిండిపోయాయి. ఈ కాల్వను పలువురు రైతులు చెరువులను నింపేందుకు గండి కొట్టి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న నీటి పారుదల శాఖ డీఈ సమ్మయ్య, సైట్ ఇంజినీర్ సప్తగిరి శనివారం రాత్రి యుద్ధప్రాతిపాదికన పొక్లెయినర్‌తో గండికి మరమ్మతు చేసి పూడ్చివేశారు.



## 21 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

**అచ్చంపేట, న్యూస్‌టుడే :** ఈ నెల 21 నుంచి అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఎస్ఏ)-1 పరీక్షలు నిర్వహించాలని డీఈవో డా. గోవిందరాజులు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ నెల 21 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. 6, 8వ తరగతి విద్యార్థులకు ఈ నెల 21 నుంచి 28 వరకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 7, 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, పదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు.

## కొనసాగుతున్న నీటి ఎత్తిపోత

**కొల్లాపూర్, న్యూస్‌టుడే :** ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టులో భాగంగా ఎల్లూరు లిఫ్ట్ నుంచి పంపులతో నీటి ఎత్తిపోత కొనసాగుతోంది. ఆదివారం నాటికి 12.50 టీఎంసీల నీళ్లను ఎత్తిపోసి ఎల్లూరు జలాశయంతో పాటు ఇతర జలాశయాలకు తరలించినట్లు ప్రాజెక్టు డీఈ లోకిలాల్ తెలిపారు. మిషన్ భగీరథ పథకానికి తాగునీటి అవసరాలకు, పంటలసాగుకు సాగునీటికి నీళ్లు అందిస్తున్నామన్నారు. నేటికి కూడా లిఫ్ట్‌లో 1, 2, 4వ పంపుమోటార్లతో నిరంతరంగా నీళ్ల ఎత్తిపోత కొనసాగుతోందన్నారు. నీటిని వృథా చేయకుండా సాగు, తాగునీటి అవసరాలకు పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

# ఇక మెరుగైన పౌష్టికాహారం

- 312 ప్రభుత్వ పాఠశాలల్లో మంచి భోజనం
- సీఎం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు

న్యూస్‌టుడే, కోస్గి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాకుండా, విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. చాలా పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడంలేదనే విమర్శలు ప్రస్తుతం ఉన్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు ఒకేచోట నాణ్యమైన భోజనాన్ని తయారుచేసి అన్ని పాఠశాలలకు అందించాలని, దీంతో విద్యార్థులందరికీ బలవర్ధకమైన పౌష్టికాహారం అందుతుందని భావించారు. పైలెట్ ప్రాజెక్టుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ని ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఇందుకోసం అక్షయపాత్ర సంస్థ బాహుబలి వంటషెడ్‌ను కొడంగల్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు దీని నిర్మాణం పూర్తిచేసి, విద్యార్థులకు భోజనం అందించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. వంటగది నిర్మాణానికి రూ. 4 కోట్లు వెచ్చించనున్నారు. హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ రూ. 2 కోట్లు, సీఎస్ఆర్ ఫౌండేషన్ రూ. 2 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే నిర్మాణం ఒక కొలిక్కి వచ్చింది. కొంతమేర సామగ్రి సైతం చేరుకుంది. పనులను వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని అధికారులు యోచిస్తున్నారు.




కొడంగల్‌లో నిర్మిస్తున్న భారీ వంటశాల

- కొడంగల్ నియోజకవర్గం పరిధిలో నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలు ఉన్నాయి. మొత్తం 312 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కొడంగల్ నుంచి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించనున్నారు. 28 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఈ నెలాఖరు నుంచి కొత్త మెనూప్రకారం భోజనం అందిస్తామని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో అన్నారు.




# ఫసల్ బీమా అమలుకు రంగం సిద్ధం

న్యూస్‌టుడే, తెలకపల్లి, దామరగిద్ద

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ పథకాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై మహబూబ్‌నగర్‌లో రెండుసార్లు ఉమ్మడి జిల్లా వ్యవసాయ, ఉద్యాన, ప్రణాళిక అధికారులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఉపసంచాలకుడు హాజరై చర్చ నిర్వహించారు. రైతులు, రైతుల సంఘాల నాయకుల అభిప్రాయలు తీసుకున్నారు.


**ప్రయోజనాలు ఎక్కువే :** ఈ పథకం అమలుతో రైతులకు బోలెడు ప్రయోజనాలు చేకురుతాయి. అననుకూల వాతావరణమే కాకుండా ఏ విధంగా పంట నష్టపోయినా బీమా వర్తిస్తుంది. వర్షాలు లేక పంట వేయకున్నా, సాగుచేసిన పంటలో అడవిపందులు, జింకల వంటి జంతువుల బెడదతో నష్టపోయినా పథకం వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలకూ కవరేజీ ఉంటుంది. పంట కోత సమయంలో వడగళ్లవాన తదితర కారణాలతో పంట నష్టపోతే బీమా వర్తిస్తుంది. రైతు యూనిట్‌గా అమలు చేస్తే ప్రయోజనమని కొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.



దామరగిద్దలో వరిపైరు

**వానాకాలంలో ఇలా... :**
- మహబూబ్‌నగర్ జిల్లాలో మక్కలు, జొన్న, కంది, పత్తి, టమటా పంటలకు మండలం యూనిట్‌గా తీసుకొని పథకం అమలు చేయనున్నారు. వరిపైరు మాత్రం గ్రామం యూనిట్‌గా తీసుకుంటారు.
- గద్వాల జిల్లాలో వరి, కంది, మక్క, వేరుశనగ, పత్తి, టమట పైర్లు మండలం యూనిట్‌గా తీసుకోనున్నారు.
- వనపర్తి జిల్లాలో జొన్న, వేరుశనగ, కంది, చెరకు, పత్తి, టమట పంటలకు మండలం యూనిట్‌గా అమలు చేస్తారు. వరిపైరు మాత్రం గ్రామం యూనిట్‌గా అమలవుతుంది.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో మక్కలు, కంది, జొన్న, పత్తి పైర్లకు మండలం యూనిట్‌గా అమలు చేస్తారు. వరి పైరు మాత్రం గ్రామం యూనిట్‌గా తీసుకుంటారు.
- నారాయణపేట జిల్లాలో కంది, పత్తి, పెసర, జొన్న పైర్లు మండలం యూనిట్‌గా అమలవుతాయి. వరిపైరు గ్రామం యూనిట్‌గా అమలవుతుంది.
- రైతుకు పైసా ఖర్చు లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తున్నందున రైతులు ఈ పథకం వినియోగించుకోవాలని నారాయణపేట జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.



# పది మొక్కల లక్ష్యం.. ఇచ్చింది ఫలితం





ధరూరు ఉన్నత పాఠశాల అవరణలో పచ్చదనం

ఏపుగా పెరిగిన మొక్కలు

**ధరూరు, న్యూస్‌టుడే:** ఇంట్లో నుంచి బయటకు వెళ్తే తిరిగి ఇంటికి వచ్చే లోపు కరోనా మహమ్మారి ఎక్కడ కబళిస్తుందోనన్న భయంతో బతుకుతున్న రోజులు.. ధరూరు పాఠశాల ఉపాధ్యాయులదీ అదే పరిస్థితి. రోజూ 1,150 మంది విద్యార్థుల మధ్య తిరుగుతూ నిత్యం కళకళలాడే పాఠశాల బోసిపోయిన తీరు. ఆ సమయంలో ఏదీ తోచని ఉపాధ్యాయులకు ఓ చక్కటి ఆలోచన చేశారు. ప్రధానోపాధ్యాయుడికి వివరించి ఆయన నిర్ణయంతో అడుగు ముందుకేశారు. గ్రామ మాజీ సర్పంచి సహకారంతో పాఠశాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు.

ఉపాధ్యాయులే తలా ఇంత పోగేసి దాతల సహకారంతో రూ.లక్ష వరకు వెచ్చించి కడియం నర్సరీ నుంచి ప్రత్యేకంగా మొక్కలు తెప్పించారు. తలా పది మొక్కలు దత్తత తీసుకొని కరోనా అంతరించి పోయి పాఠశాలలు తెరిచే దాకా సంరక్షిస్తూ నీరందించారు. ఎవరికి వారు తాము దత్తత తీసుకున్న పదిమొక్కల పెంపకం పూర్తి బాధ్యతలు ఇప్పటికీ నిర్వర్తిస్తూ వస్తున్నారు. రెండేళ్లు గడిచే సరికి పాఠశాల పచ్చదనపు కళతోపాటు చల్లదనాన్ని, స్వచ్ఛమైన గాలినీ ఇస్తోంది. చెట్లను చూస్తే తృప్తిగా అన్పిస్తుందని ఉపాధ్యాయులంటున్నారు.



హంస వాహనంపై జలవిహారం



అలంకరణలో ఉత్సవమూర్తులు

# వైభవం..జోగులాంబ తెప్పోత్సవం!



నదిహారతులు ఇస్తున్న అర్చక స్వాములు

**అలంపూర్, న్యూస్‌టుడే:** శక్తి పీఠంలో దసరా ఉత్సవాలు విజయ దశమితో ముగిశాయి. ముగింపు సందర్భంగా శనివారం తుంగభద్ర నదిలో తీర్థావలి నిర్వహించారు. దేవతమూర్తుల విగ్రహాలతో పాటుగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి హంస వాహనంపై తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో నదిలో విహరించారు. తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పుష్కర్‌ఘాట్ కిక్కిరిసిపోయింది. ఉత్సవం సందర్భంగా నదీ హారతి ఇచ్చారు. కలెక్టర్ సంతోష్ దంపతులు, ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలను ముగించారు. 108 రకాల సుగంధ ద్రవ్యాలు, వన మూలికలు, పట్టువస్త్రాలు ఆహుతి ఇచ్చారు. ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. హంసవాహనంలోకి కేవలం కలెక్టర్ దంపతులు, ఎమ్మెల్యే, ఆలయ ఛైర్మన్‌కు మాత్రమే అవకాశం కల్పించారు. ధర్మకర్త సభ్యులు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. తమకే అవకాశం కల్పించకపోతే ఎలా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.



భక్తజనంతో కిక్కిరిసిన పుష్కర్‌ఘాట్



మూర్తులకు పుణ్యస్నానాలు



ఆలయంలో భక్త జనసందోహం

# ప్రభుత్వ గోదాముల్లోనే ధాన్యం నిల్వ!

**ధరూరు, మల్దకల్, న్యూస్‌టుడే:** రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలించటం వాటిని కస్టం మిల్లింగ్ చేసిన తర్వాత తిరిగి ప్రభుత్వానికి అప్పగించటంలో అనేక లోపాలు, అక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక మీదట రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నేరుగా ప్రభుత్వ గోదాములకు తరలించి నిల్వ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనలకు వ్యవసాయ శాఖ ఆమోదం తెలిపింది. త్వరలోనే దీనికి సంబంధించి ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.



కుర్తిరావల్ చెర్వు వద్ద నిర్మించిన 5 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ గోదాం

## గతంలో ఇలా

వరి ధాన్యం నేరుగా మిల్లులకే కేటాయించటం కస్టమ్ మిల్లింగ్ ద్వారా తిరిగి వారి నుంచి బియ్యంను తీసుకోవటం చేశారు. ఈ ఏడాది మిల్లర్లు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచటంతో పాటు మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని పట్టుబట్టుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నిర్ణయం వెనక మరో అంశం కూడా ఉన్నట్లు సమాచారం. గతంలో మిల్లులు కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్‌కు తరలించి అమ్ముకోవటం వాటి స్థానంలో పీడీఎస్ లేదా ఇతర చోట్ల నుంచి సేకరించిన బియ్యం ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. కొన్ని మిల్లుల నిర్వాహకులు ధాన్యం నిల్వలను పక్కదారి పట్టించి బియ్యం ఇవ్వలేక బకాయిపడ్డారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు, ఆస్తుల జప్తునకు కలెక్టర్లు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.



## అవసరమున్న మేరకే మిల్లింగ్

కొనుగోలు చేసిన ధాన్యం వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఉన్న గోదాములు, స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో నిల్వ చేయనున్నారు. అయితే ఇప్పటికే వాటిని ఇతరులకు లీజుకు ఇచ్చి ఉంటే వాటిని ఖాళీ చేయించి వరి ధాన్యం నిల్వకు ఉపయోగించనున్నారు. జిల్లాలు, మండలాల వారీగా వచ్చే ధాన్యాన్ని సమీపంలో వ్యవసాయ శాఖ గోదాములకు తరలించి నిల్వ చేస్తారు. రైసు మిల్లర్లతో సమస్య పరిష్కారం అయిన తర్వాత వారికి కేటాయించే అవకాశం ఉంది. ధాన్యం మిల్లులకు కేటాయింపుల్లో కూడా ఈసారి మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలిసింది. సంక్షేమ పథకాలకు అవసరం ఉన్న మేర మాత్రమే మిల్లింగ్ చేయించి మిగిలిన వరిధాన్యం బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు సమాచారం.

## నేటికి మంచి రోజులు

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న చోట మండలానికి 5వేల మెట్రిక్ టన్నులు, సాగువిస్తీర్ణం ఎక్కువగా ఉన్నచోట 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములను నిర్మించారు. వాటిలో చాలా వరకు వినియోగంలోకి రాలేదు. గట్టు, కేటీదొడ్డి మండలాల పరిధిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములు ఐదేళ్లుగా వృథాగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 65 మండలాల పరిధిలో గోదాములు నిర్మించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ పరిధిలో ఉన్న గోదాముల్లో 4.50 లక్షల టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు అందుబాటులో ఉన్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో మొత్తం 17 చోట్ల దాదాపు 2లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాములున్నాయి. జోగులాంబ జిల్లాలోనే 8 మండలాల పరిధిలో 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16.25 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం దిగుబడి రానుందని అంచనా. దీనికి అనుగుణంగా నిల్వకు ఇటు వ్యవసాయ శాఖ అటు పౌరసరఫరాల శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

# తుంగభద్రలో భారీగా పెరుగుతున్న ప్రవాహం



ఆర్డీఎస్ వద్ద తుంగభద్ర పరవళ్లు

**శాంతినగర్, న్యూస్‌టుడే:** తుంగభద్ర నదిలో ఆదివారం ప్రవాహం భారీగా పెరిగింది. జలాశయం ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండటంతో దాని నుంచి 80 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. జలాశయం దిగువన నదీపరివాహక ప్రాంతాల్లో పడుతున్న వర్షాలకు మరో 17,880 క్యూసెక్కులు, మొత్తం 97,880 క్యూసెక్కుల ప్రవాహం ఆర్డీఎస్ ఆనకట్టకు వద్ద ఉంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆనకట్ట వద్ద 12.8 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చేసరికి అది 5.2 అడుగులుగా ఉంది.

# మాంసం ముక్క గొంతులో ఇరుక్కొని రైతు మృతి



కాకి వెంకటన్న

**మదనాపురం, న్యూస్‌టుడే :** మాంసం ముక్క గొంతులో ఇరుక్కుని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి ఓ రైతు మృతి చెందారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొన్నూరు గ్రామానికి చెందిన రైతు కాకి వెంకటన్న (52) దసరా కనుమ పండగ సందర్భంగా ఆదివారం ఉదయం ఇంటికి మాంసం తెచ్చుకున్నారు. 10 గంటల సమయంలో అన్నం తింటుండగా మాంసం ముక్క గొంతులో ఇరుక్కుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొత్తకోటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

# జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఎంపిక

**మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే :** జాతీయస్థాయి అండర్-19 టార్గెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ బాల,బాలికల జట్లకు ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. నవాబుపేట మండలం సిద్దోటంకు చెందిన ఎన్.కృష్ణ, కోయిలకొండ మల్కాపూర్‌కు చెందిన కె.నవీన్, కోయిలకొండ మండలం పారుపల్లిలోని శ్వేత విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుమిత్ర, నాగలక్ష్మి, కేదారేశ్వరి, పి.రాంచరణ్‌లు బాల,బాలికల జట్లకు ఎంపికయ్యారు. జూనియర్స్ టోర్నీ బిహార్‌లోని రాంసహాయ్ ఛాప్రాలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులను టార్గెట్‌బాల్ సంఘం సభ్యులు ఉమామహేశ్, శీనయ్య తెలిపారు.

## 500 మిలియన్ యూనిట్లకు చేరిన విద్యుదుత్పత్తి

**ఆత్మకూరు, న్యూస్‌టుడే :** జూరాల జలాశయం వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతున్న క్రమంలో ప్రస్తుత వర్షాకాలం ఎగువ, దిగువ కేంద్రాల్లో ఉత్పత్తి 500.600 మిలియన్ యూనిట్లకు చేరింది. ప్రాజెక్టుకు 42 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 37,267 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.143, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 3.493 మిలియన్ యూనిట్ల మేరకు ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత సీజన్‌లో ఎగువన 261.142, దిగువన 239.458 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరిందని ఎస్ఈ జెన్‌కో (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

# సమాజహితాన్ని కోరిన సాయిబాబా

## పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



మహబూబ్‌నగర్: తెలంగాణ కూడలిలో సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎం.రాఘవాచారి, తదితరులు

**పాలమూరు, న్యూస్‌టుడే:** సమాజ మార్పుకై, భవిష్యత్తు తరాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఘనత ఆచార్య సాయిబాబాకే దక్కిందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి అన్నారు. ఈ మేరకు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం తెలంగాణ కూడలిలో సాయిబాబా సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత 15 రోజుల నుంచి తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేదీ రాత్రి చనిపోయారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్ల నుంచి ఆయనపై అక్రమ కేసులు పెట్టి హింసకు గురి చేసిందని విమర్శించారు. సాయిబాబా 9 ఏళ్ల పాటు ఒంటరిగా జైల్ జీవితం అనుభవించారని చెప్పారు. కారాగారంలో సరైన చికిత్స అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. జైలు శిక్షలో ఉండగానే మహారాష్ట్ర హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించిందన్నారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, డీటీఎఫ్ నాయకులు ఆదిత్య, వెంకటేశ్వర్లు, నాగభూషణం, వామన్‌కుమార్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు మన్నెం కొండ, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు తిమ్మప్ప, కేసి వెంకటేశ్వర్లు, ఉదయమిత్ర తదితరులు పాల్గొన్నారు.


# కాల్వలోకి వాహనం దూసుకెళ్లి ఒకరు..



మహమ్మద్ బేగం

**కందనూలు, న్యూస్‌టుడే :** పత్తి తీయడానికి కూలీ పనులకు వెళ్తూ ఒకరు దుర్మరణం చెందగా మరో 12 మందికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటికి చెందిన 13 మంది కూలీలు అదే గ్రామ శివారులోని సర్వసతీ ఆలయ సమీపంలోని ఓ రైతు పొలంలో పత్తితీతకు వాహనంలో బయలుదేరారు. ప్రధాన రహదారి నుంచి పొలంలోకి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కేఎల్ఐ కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న మహమ్మద్ బేగం (45) అక్కడికక్కడే మృతి చెందగా మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగ్రాతులను 108 వాహనంలో పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నారు. మహమ్మద్ బేగం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో రైతు..



జానకి రాములు

**లింగాల, న్యూస్‌టుడే:** విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం పద్మన్నపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకోంది. బంధువుల కథనం ప్రకారం.. రైతు పులిపాటి జానకి రాములు (60) శనివారం రాత్రి మొక్కజొన్న పంట కాపలా కోసం వెళ్తుండగా ప్రమాదవశాత్తు వ్యవసాయ బోరు తీగ కాలుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విద్యుదాఘాతానికి గురై జానకిరాములు మృతి చెందినట్లు గుర్తించారు. భార్య, మగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## చెక్‌డ్యాంలో పడి బాలుడు..

**తాడూరు, న్యూస్‌టుడే :** తాడూరు శివారు కొమ్ముగుట్ట సమీపంలోని చెక్‌డ్యాంలో ఆదివారం మధ్యాహ్నం బర్రెలను నీళ్లు తాగించేందుకు వెళ్లిన 11ఏళ్ల ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగిపోయాడు. గమనించిన చుట్టు పక్క రైతులు అక్కడి చేరుకొని నీటిలో నుంచి బయటికి తీయగా బాలుడు అప్పటికే మృతి చెందాడు.

## వేడి నూనెలో పడి చిన్నారికి తీవ్ర గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దినేశ్

**వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే:** వేడి నూనెలో పడిన తొమ్మిదేళ్ల బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన వెల్దండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దసరా పండుగ సందర్భంగా శనివారం ఉదయం వెల్దండలోని పాండు ఇంట్లో పిండి వంటలు చేశారు. భార్య పావని బాండీలో నూనెను అలాగే ఉంచారు. కుమారుడు చిన్నారి దినేష్ ఆడుకుంటూ అటుగా వచ్చి తగలడంతో బాండీలోని నూనెంతా కింద ఒలికింది. అందులోనే బాలుడు జారి పడటంతో ఒళ్లంగా తీవ్రంగా కాలింది. కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.



## బాధిత కుటుంబీకుల ఆందోళన



బాలానగర్: రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

**బాలానగర్, న్యూస్‌టుడే:** మండలంలోని మొదంపల్లి గ్రామానికి చెందిన స్వామి(25) శుక్రవారం రాత్రి టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే.. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై శనివారం ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో 2 గంటలకు పైగా ట్రాఫిక్ జామ్ నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్పందించిన సీఐ నాగార్జున గౌడ్, ఎస్సై తిరుపాజీ టిప్పర్ డ్రైవర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ మంజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

## నాటు వైద్యం వికటించిన ఘటనలో ఇద్దరిపై కేసు

**మహబూబ్‌నగర్ నేరవిభాగం:** నాటు వైద్యంతో వ్యాధిని నయం చెద్దామనుకున్న వారికి అది వికటించడంతో ఇరువురిపై కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ రాజకీయ నాయకుడు కొన్నేళ్ల నుంచి పక్షవాతంతో బాధ పడుతున్నారు. వ్యాధి పూర్తిగా నయం చేస్తామని బాధితుడికి తెలిసిన వ్యక్తి భరోసా కల్పించాడు. దీంతో అతను మరో నాటు వైద్యుడిని తీసుకొచ్చి గత నెల 21వ తేదీన ఇంట్లోనే చికిత్స చేశారు. కాళ్ల నుంచి శరీరమంతా చపాతీల కర్రతో కొట్టి అనంతరం శరీరంపై నాటు మందు వేశారు. దీంతో మరుసటి రోజు ఉదయం శరీరంపై దద్దులు వచ్చి పగిలిపోయాయి. ఈ విషయమై నాటు వైద్యం చేసి వెళ్లిన వారికి సమాచారం అందించగా వారు రాలేదు. దీంతో గత నెల 30న బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# దంపతుల మరణానికి కారణమైన వ్యక్తిపై కేసు

**రేవల్లి(గోపాల్‌పేట), న్యూస్‌టుడే :** వేరుసెనగ పైరును అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్తు కంచె ఏర్పాటు చేసి ఇద్దరు వ్యక్తుల ప్రాణాలు పోవడానికి కారణమైన శానాయిపల్లి గ్రామానికి చెందిన బుడ్డ బాలయ్యపై కేసునమోదు చేశామని రేవల్లి ఎస్సై రాము తెలిపారు. రేవల్లి మండలంలోని కొత్తబండరావిపాకుల గ్రామానికి చెందిన బక్కన్న, నారమ్మ దంపతులు ఈనెల 11వ తేదీన సాయంత్రం సీతాఫలాలు తెంచుకుని రావడానికి శానాయిపల్లి గుట్టపైకి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో వేరుసెనగ పైరుకు రక్షణగా పెట్టిన విద్యుత్తు కంచె తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. శానాయిపల్లి, కొత్తబండరావిపాకుల గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాన్‌గల్ ఎస్సై శ్రీనివాసులు, రేవల్లి ఎస్సై రాము సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మృతుల కుమారుడు కాశీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం మృతదేహాలకు రేవల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించినట్లు పోలీసులు తెలిపారు.

## చికెన్ ధరలు



| | |
|---|---|
| ఫాంరేటు | 126-00 |
| రిటైల్ | 148-00 |
| డ్రెస్డ్ | 215-00 |
| స్కిన్‌లెస్ | 244-00 |

**మేమున్నాం.. మీకు తోడుగా..** ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

| | |
|---|---|
| నాగర్‌కర్నూలు | 7993300530 |
| అచ్చంపేట | 8008573927 |
| కల్వకుర్తి | 9908803650 |
| కొల్లాపూర్ | 8008573870 |

న్యూస్‌టుడే, అచ్చంపేట న్యూటౌన్

? పురపాలిక పరిధిలో చెత్త సేకరణ ఆటోలు సకాలంలో రాకపోవడంతో ఖాళీ



స్థలాల్లో పడేస్తున్నారు. టీచర్స్ కాలనీలో ఇళ్ల మధ్య తడి, పొడి చెత్తను వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది.

**- గోవర్ధన్‌రెడ్డి**

✔ ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానా వేస్తాం. చెత్త సేకరణ ఆటోలో మాత్రమే వేసేలా అవగాహన కల్పిస్తాం.

**- శ్యామ్‌సుందర్, పుర కమిషనర్, అచ్చంపేట**

**తెరపై ఈనాడు**

**నాగర్‌కర్నూల్‌లో..** రవి : **దేవర.** రమణ : **వేట్టయన్ ద హంటర్.** రామకృష్ణ : **విశ్వం.** **కల్వకుర్తిలో..** పార్థసారథి : **దేవర.** అశోక్ : **వేట్టయన్ ద హంటర్**

## కూరగాయల ధరలు కిలో... రూ.లలో

**కందనూలు, న్యూస్‌టుడే :** టమాటా 80, వంకాయ 40, బెండ 45, మిరప 50, కాకర 65, బీర 64, క్యాలీఫ్లవర్ 75, క్యాబేజీ 45, క్యారెట్ 65, దొండ 48, ఆలుగడ్డ 45, గోకర 64, దోస 40, ఆనకాయ 18, చిక్కుడు 65, మునగకాయ 78, బీట్‌రూట్ 60, బీర 45, బీన్స్ 95

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

**కందనూలు, న్యూస్‌టుడే :** నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని జమ్మి చెట్టుకు పూజలు చేసి ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో అసంపూర్తిగా వదిలివేసిన సీసీ రహదారుల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కేసరి సముద్రం చెరువు సమీపంలో రెండు ఆకాశ దీపాలను చెరువులో లాంచీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కౌన్సిలర్లు కావలి శ్రీనివాసులు, నిజాం, జక్కా రాజు, తీగల సునేంద్ర, మలిశెట్టి పద్మమ్మ, బచ్చన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి క్రయవిక్రయాలు

**అచ్చంపేట, న్యూస్‌టుడే :** స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం నుంచి ధాన్యం క్రయవిక్రయాలు నిర్వహించనున్నామని మార్కెట్ కార్యదర్శి నరసింహులు తెలిపారు. దసరా సందర్భంగా ఈ నెల 11 నుంచి 13 వరకు మూడు రోజులు సెలవులు ప్రకటించామని చెప్పారు. తేమ లేకుండా ధాన్యం ఆరబెట్టుకొని అమ్మకానికి తెస్తే కనీస మద్దతు ధర అందజేస్తామన్నారు.

## ప్రతి పౌరుడు దేశాభిమానం కలిగి ఉండాలి

**తెలకపల్లి, న్యూస్‌టుడే :** సమాజంలోని ప్రతి పౌరుడు దేశాభిమానం పెంచుకోవాలని, దేశాభివృద్ధికి కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ పత్తికొండ రాము అన్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తైన సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం సంఘ శ్రేణులు పథసంచలన్ నిర్వహించారు. మండల కార్యవాహ చంద్రశేఖర్, ఉమాపతిచారి, రవికుమార్‌చారి, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి మార్గం.. గ్రామాభివృద్ధికి ఊతం

**కందనూలు, న్యూస్‌టుడే :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పల్లె ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి కల్పించడానికి, వలసలు అరికట్టడానికి, రైతుల అభ్యున్నతికి ఉపాధి పథకంలో వివిధ రకాల పనులు చేపట్టనున్నారు. జిల్లాలో మొత్తం 461 గ్రామపంచాయతీలుండగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జిల్లావ్యాప్తంగా 1.83 లక్షల మంది కూలీలు పని చేస్తున్నారు. మరిన్ని ఎక్కువగా పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేకాధికారులు, డీఆర్‌డీవో శాఖ సిబ్బంది, ఎంపీడీవోలు పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ప్రజలు, రైతులు సూచించిన పనులను నివేదిక రూపంలో తీర్మానాలు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నారు. వీటిని డిసెంబర్‌లో నిర్వహించే జిల్లా పరిషత్తు, మండల సమావేశాల్లో ఆమోదించనున్నారు.

**సభలు నిర్వహిస్తున్న అధికారులు**



నాగర్‌కర్నూల్ : మండలంలోని గగ్గలపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి

| | |
|---|---|
| జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు | 1.95 లక్షలు |
| మొత్తం కూలీల సంఖ్య | 3.75 లక్షలు |
| పని చేస్తున్న కూలీలు | 1.83 లక్షలు |
| 100 రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు | 1,048 |

**ప్రజాభీష్టానికే పెద్దపీట :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మొత్తం 250 పనులు చేసుకోవడానికి అవకాశం ఉంది. అధికారులు ప్రజల ఇష్టం మేరకు పనులను చేపట్టనున్నారు. గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టి భూగర్భ జల వనరులు పెంపొందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని సీసీ రహదారుల పక్కన, చెరువు కట్టలపైన మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. వీటితో పాటు ఇంకుడు గుంతలు, కందకాల నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను, వాటి చిత్రాలను అంతర్జాలంలో నమోదు చేస్తున్నారు. ప్రతి రోజు పని చేసిన కూలీల వివరాలు అంతర్జాలంలో నమోదు చేసి డబ్బులు చెల్లిస్తున్నారు.

**సకాలంలో పూర్తి చేస్తాం.. :** 2025-26 సంవత్సరానికి గాను పనులు గుర్తించడానికి జిల్లాలో గ్రామసభలు నిర్వహిస్తున్నాం. ఈ సభలను సకాలంలో పూర్తి చేస్తాం. గుర్తించిన పనుల వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. ఎంపీడీవోల గ్రామసభలను పర్యవేక్షణ చేస్తున్నారు.

**- చిన్న ఓబులేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి**

## ప్రతిభావంతులకు సన్మానం



ఎంబీబీఎస్ సాధించిన మంజుశ్రీ, 6 ఉద్యోగాలు సాధించిన శ్యామలను సన్మానించిన యువసంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

**కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే :** కొల్లాపూర్ పట్టణానికి చెందిన మూలే మంజుశ్రీ ఇటీవల వెలువడిన ఎంబీబీఎస్ ఫలితాల్లో ప్రతిభ చాటింది. దీంతో కొల్లాపూర్ యువసంకల్ప సభ్యులు శాలువా, పూలమాలతో సన్మానించారు. ఇటీవల గురుకుల పాఠశాలల బోర్డు వెల్లడించిన ఉద్యోగ ఫలితాల్లో ఆరు ఉద్యోగాలు సాధించిన పట్టణానికి చెందిన మూలే శ్యామలను సన్మానించారు. యువత ఉన్నత చదువులు చదివేందుకు ప్రోత్సహిస్తామని సంస్థ అధ్యక్షుడు రమేశ్ అన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నరేందర్, నీలస్వామి, దామోదర్, చంద్రకళ, శివ, కృష్ణ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగులు ఇవ్వండి

**అచ్చంపేట :** డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు వెంటనే వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగులు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి డా. శ్రీధర్‌శర్మ డిమాండ్ చేశారు. సీఎం చేతుల మీదుగా ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయాల్లో విధుల్లో చేరారని తెలిపారు. ఈ నెల 15 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నందున వెంటనే ఖాళీల వివరాలను ప్రకటించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి అవకాశం కల్పించి పాఠశాలలను కేటాయించాలని సూచించారు. ఖాళీలను వెంటనే భర్తీ చేస్తే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు.

## రూ.1,22,116 పలికిన గొరిట అమ్మవారి లడ్డూ

**తిమ్మాజిపేట, న్యూస్‌టుడే :** గొరిట గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత లడ్డూను గ్రామానికి చెందిన నారన్ శ్రీధర్‌రెడ్డి రూ.1,22,116కు దక్కించుకున్నారు. అనంతరం భారీ ఊరేగింపుమధ్య అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు.



తిమ్మాజిపేట : దక్కించుకున్న లడ్డూతో శ్రీధర్‌రెడ్డి



కొల్లాపూర్ బాలికల నృత్య ప్రదర్శన



నాగర్‌కర్నూల్ : పాతయ్యనగర్ కాలనీలో అమ్మవారి విగ్రహం వద్ద బొడ్డెమ్మలు వేస్తున్న మహిళలు



నాగర్‌కర్నూల్ : ట్యాంక్‌బండ్‌పై ప్రజలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఆయన సతీమణి డా. సరిత



నాగర్‌కర్నూల్ : పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై ప్రజల సందడి

## వేలం పాటలతో రూ.4.22 లక్షల ఆదాయం

**అమ్రాబాద్, న్యూస్‌టుడే:** నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి అలంకరించిన పట్టుచీరలు, ముక్కుపుడక, రూపాయల దండ, కలశాలకు ఆదివారం రాత్రి వేలం పాటలు నిర్వహించగా రూ. 4.22 లక్షల ఆదాయం లభించింది. అమ్రాబాద్ అమరేశ్వరాలయంలోని అమ్మవారికి అలంకరించిన పట్టు చీరలు, ముక్కుపుడకలు, కలశం, రూపాయల దండలను దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో వేలపాటలు నిర్వహించారు. అమ్మవారి ముక్కుపుడకను రూ.1.61 లక్షలకు అమ్రాబాద్‌కు చెందిన చింతపల్లి రాజుగౌడ్, మరో ముక్కుపుడకను రూ.50 వేలకు సోమలు అంజిగౌడ్, కలశం రూ.90 వేలకు అమ్రాబాద్‌కు చెందిన ఐదుకలి కొండయ్యచారి దక్కించుకున్నారు. పట్టు చీరలను రూ.53 వేలకు దుగ్గి బాలరాజు, మరో చీరను రూ.41 వేలకు ఎలిశాల కార్తిక్, రూపాయల దండను రూ.27 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. కమిటీ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రూ. 25 వేలు నగదు బహుమతి

**అచ్చంపేట, న్యూస్‌టుడే :** ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో స్థానిక పద్మశాలి సంఘం మహిళలు ప్రత్యేకంగా




అచ్చపేట : రూ. 25 వేల బహుమతి అందుకున్న పద్మశాలి మహిళా సంఘం ప్రతినిధులు

బతుకమ్మను అలంకరించారు. బాలికల సంరక్షణ నినాదాలతో ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో అలంకరించి ఆట పాటలతో సందడి చేశారు. చిన్నారుల ప్రత్యేక వేష ధారణలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ అలంకరణ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 25 వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని సొంతం చేసుకున్నారు. పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు శకుంతల, ప్రతినిధులు గీత, హైమావతి తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# కనుల పండుగగా అమ్మవారి శోభాయాత్ర



కల్వకుర్తి : వేదికపై నృత్యాలు చేస్తున్న బాలికలు

దేవీ నవరాత్రులను పురస్కరించుకొని గ్రామాలు, పట్టణాల్లోని కాలనీల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలకు తొమ్మిది రోజుల పాటు పూజలు చేసిన నిర్వాహకులు ఆదివారం అర్ధరాత్రి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి వస్తువులకు వేలం పాట నిర్వహించారు. అమ్మవారి శోభయాత్ర కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొని బొడ్డెమ్మలు వేశారు. చిన్నారులు నృత్యాలు చేశారు. గ్రామాల్లోని ప్రజలు సాయంత్రం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన జమ్మిచెట్టుకు పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, బృందం



అమ్రాబాద్‌లో జమ్మి చెట్టు వద్ద జమ్మి తెంపుతున్న భక్తులు



కొల్లాపూర్ : వరిదేల శమీవృక్షం వద్ద ప్రశంసా పత్రాలతో నృత్యం ప్రదర్శించిన బాలికలు

## పోయి రావమ్మా బతుకమ్మ



ఊర్కొండ: ముచ్చర్లపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సద్దుల బతుకమ్మ వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణాలు, గ్రామాల్లో మహిళలు వివిధ పూలతో బతుకమ్మను తయారు చేశారు. ఇంట్లో ప్రత్యేక పూజల అనంతరం పాటలు పాడుతూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని చెరువులలో వదిలారు. – న్యూస్‌టుడే, బృందం



వెల్దండలో..

## బతుకమ్మ అలంకరణ పోటీలు

**అచ్చంపేట, న్యూస్‌టుడే :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో స్థానిక భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదో రోజు దసరా పండుగ సందర్భంగా అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ మహిళా కమిటీ అధ్యక్షురాలు రమాదేవి, ప్రతినిధులు వరలక్ష్మి, అవంతి, మాలతి, సుజాత, స్వరూప, ఉమ తదితరుల ఆధ్వర్యంలో ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం మహిళలకు బతుకమ్మ అలంకరణ పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు ప్రకటించారు.

## విజేతలకు బహుమతి ప్రదానం

**వెల్దండ, న్యూస్‌టుడే:** చెదురుపల్లి, కుప్పగండ్ల, అజిలాపూర్, రాచూర్, కొట్ర తదితర గ్రామాల్లో దసర పండుగ సందర్భంగా వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయా పోటీల నిర్వాహకులు, నాయకులు నగదుతో పాటు జ్ఞాపికలను ఆదివారం అందజేశారు. చెదురుపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, నాయకులు పోలే అశోక్, కుప్పగండ్ల గ్రామంలో నాయకులు శేఖర్, వెంకట్‌రెడ్డి, అశోక్‌తేజ, రమేశ్, రాచూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్, కొట్ర గ్రామంలో మాజీ సర్పంచి వెంకటేశ్వర్‌రావు పాల్గొని విజేతలను అభినందించారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న మాజీ ఎంపీపీ వెంకటయ్యగౌడ్

**కల్వకుర్తి పట్టణం :** కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారిని వెండి చీరతో అలంకరించారు. ఆదివారం ఆలయం వద్ద అమ్మవారి శోభయాత్ర ఘనంగా నిర్వహించారు. నవరాత్రులు పూజలందుకున్న అమ్మవారి లడ్డూను రూ. 71,116లకు దాచెపల్లి నరసింహస్వామి దక్కించుకున్నారు. మొత్తం అమ్మవారి చీరలు వేలం నిర్వహించగా రూ. 16,65,336లు వచ్చాయి.

**అమ్రాబాద్ :** పదరలో అమ్మవారి ముక్కుపుడకను వేలంలో రూ. 8లక్షల పది వేలకు భక్తుడు బూరం సురేశ్ దుక్కించుకున్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**అచ్చంపేట, న్యూస్‌టుడే :** అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నామని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. ఆదివారం అచ్చంపేటలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా చేపట్టనున్నామని తెలిపారు. ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామాల్లో పంచాయతీ ప్రత్యేక అధికారి, పురపాలికల్లో కౌన్సిలర్లు, ఛైర్మన్లు సభ్యులుగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల నుంచి ఒక్కో సభ్యుడిని నియమించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే అన్ని సంక్షేమ పథకాలు ఇందిరమ్మ కమిటీల పర్యవేక్షణలో చేపట్టనున్నామన్నారు. వార్డు, గ్రామ, మండల, పురపాలిక స్థాయిలో కమిటీలు పనిచేస్తాయని తెలిపారు. నియోజకవర్గంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా శ్రద్ధ తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ రాజేందర్, నాయకులు గోపాల్‌రెడ్డి, అనంతరెడ్డి, మల్లేశ్, సీఎంరెడ్డి, రఘురాం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్‌పేటలో మొసలి సంచారం

**గోపాల్‌పేట :** గోపాల్‌పేట సమీపంలోని అమ్మచెరువులో ఆదివారం ఉదయం కొందరు వ్యక్తులు మొసలి సంచారాన్ని గుర్తించారు. చెరువు మధ్యలో ఉన్న గడ్డపై మొసలి తిరుగుతుండటాన్ని వారు చూసి వీడియోతీసి వాట్సాప్‌లో పెట్టారు. విషయం తెలిసిన వెంటనే కొందరు చెరువువద్దకు వెళ్లి మొసలిని చూసేందుకు ప్రయత్నించారు. అది కనిపించక పోవడంతో ఎవరు కూడా చెరువులోకి దిగొద్దని, మేకలు, గొర్రెలను నీరు తాగించేందుకు చెరువులోకి తీసుకెళ్లొద్దని సూచించారు. సమీపంలో పెద్ద కాలువలు, వాగులు లేకపోవడంతో మొసలి గోపాల్‌పేట చెరువులోకి ఎలా వచ్చిందనే విషయంపై పలువురు చర్చించుకుంటున్నారు.



## కనీస మరమ్మతులైనా చేపట్టరూ!

కొల్లాపూర్‌లో సురభిరాజా వంశస్థులు 1969లో భవనం కేటాయించడంతో రాణి ఇందిరాదేవి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ భవనం, తరగతుల గదులు శిథిలావస్థకు చేరాయి. తరగతి గదులు, కళాశాల భవనానికి మరమ్మతులు చేయించాలని మంత్రి జూపల్లికృష్ణారావు, సంబంధిత శాఖ అధికారులను పలుమార్లు కోరినట్లు విద్యార్థులు, అధ్యాపకులు తెలిపారు. వర్షాకాలంలో తరగతి గదుల్లో నీరు కారి ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. కొల్లాపూర్‌లోని రాణి ఇందిరాదేవి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని ఓ తరగతి గది పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

– న్యూస్‌టుడే, కొల్లాపూర్

**ఆగిన కారును ఢీకొట్టిన ఆటో.. ఒకరి మృతి.. నందిగామ, న్యూస్‌టుడే:** రహదారిపై నిలిపి ఉన్న కారును అదే మార్గంలో వస్తున్న ఆటో వెనకాల నుంచి ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నందిగామ మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న కారు డ్రైవర్ రవిబాబు నీరు తాగేందుకు మార్గమధ్యలో నందిగామ బైపాస్ రోడ్డు పక్కన తన వాహనాన్ని నిలిపాడు. అదే మార్గంలో నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలానికి చెందిన వెంకటయ్య(45), భార్య రాధిక మరో ముగ్గురు కుటుంబసభ్యులతో కలిసి ఆటోలో వస్తూ కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందగా మిగతా నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి, క్షతగాత్రులను శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

**చికిత్స పొందుతూ యువకుడి మృతి.. కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే:** చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై హృషికేశ్ వివరాల ప్రకారం.. చింతలపల్లి గ్రామానికి హరికృష్ణ (22) ద్విచక్రవాహన మెకానిక్. యన్మన్‌బెట్ల గ్రామంలో ఓ ద్విచక్రవాహనం మరమ్మతు చేసేందుకు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. యన్మన్‌బెట్ల గ్రామ శివార్లో అదుపుతప్పి ద్విచక్రవాహనం నుంచి కిందపడ్డాడు. దీంతో చికిత్స కోసం కొల్లాపూర్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. బంధువు రాఘవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. హరికృష్ణకు తండ్రి, తల్లి ఉన్నారు.



హరికృష్ణ

**బస్సు, ద్విచక్రవాహనం ఢీ.... ఒకరికి గాయాలు.. అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే :** బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడ్డారు. గ్రామ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మండల పరిధిలోని బొమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన అజయ్ ద్విచక్ర వాహనంపై అచ్చంపేటకు వెళ్తున్నారు. గ్రామ సమీపం మూల మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న అచ్చంపేట ఆర్టీసీ బస్సు ఢీకొంది. గాయపడిన అజయ్‌ను అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అటు నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

**కేఎల్ఐ కాలువలో యువకుడి గల్లంతు.. బిజినేపల్లి, న్యూస్‌టుడే :** ద్విచక్రవాహనం అదుపుతప్పి కేఎల్ఐ కాలువలో పడిన యువకుడు గల్లంతైన సంఘటన బిజినేపల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన రాముడు (35) వ్యక్తిగత పనులపై గౌరారం గ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మంగనూరు గ్రామ శివారులోకి రాగానే కేఎల్ఐ కాలువ వంతెనను ఢీకొని కాలువ ప్రవాహంలో పడి గల్లంతయ్యాడు. యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

**ఆలయంలో హుండీ చోరీ.. వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే :** వెల్దండ గ్రామ చివరలోని బుధార్‌పేట ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీని శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులు గుర్తించి ధ్వంసమైన హుండీలో కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. గ్రామ చివరన ఉండటం, సీసీ కెమెరాలు ఉన్నా దొంగలు ముఖాలకు మాస్కులు ధరించి చోరీకి పాల్పడ్డారు. ఇదే ఆలయంలో హుండీ ధ్వంసం చేసి చోరీకి పాల్పడటం ఇది నాలుగోసారి.

**దాడికి పాల్పడిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.. కందనూలు, న్యూస్‌టుడే :** పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై శనివారం రాత్రి ఎలాంటి కారణం లేకుండా తీవ్రంగా కొట్టిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఆదివారం పట్టణంలోని ఠాణాలో ఫిర్యాదు చేశారు. మండలంలోని గన్యాగులకు చెందిన మహేశ్, శివ, హరికృష్ణ కథనం ప్రకారం.. రాత్రి 11 గంటల సమయంలో ట్యాంక్ బండ్‌పై అటు ఇటు తిరుగుతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎలాంటి కారణం లేకుండా తీవ్రంగా కొట్టడంతోపాటు అసభ్యకరంగా దూషించారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆలయ శాసనం చదువుతున్న ఐజీ రమేశ్‌రెడ్డి

## రంగనాథుడి సన్నిధిలో ఐజీ

**శ్రీరంగాపురం, న్యూస్‌టుడే :** శ్రీరంగాపురంలోని రంగనాథాలయాన్ని పోలీసుశాఖ ఐజీ రమేశ్‌రెడ్డి కుటుంబసభ్యులతో శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక అర్చన జరిపించి, స్వామివారి శేష వస్త్రాన్ని అందించి ఆశీర్వదించారు. అనంతరం ఆలయంలోని తంజావూర్ చిత్రపటాలను, స్వామివారి వెండి వాహనాలను వారు సందర్శించారు. స్థానిక ఏఎస్సైలు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.